# కుటుంబ సౌభాగ్యానికి

శ్రీమతి అల్లూరి సోదరి

రేఖ అదే తొలిసారిగా అత్తింటి గడపతొక్కడం. తోటివారు ప్రతియొక్కరు తాను అత్తింటి కెళ్లేటప్పుడు కంటతడి పెట్టుకొని "జాగ్రత, ఎలా మసలుకుంటావో" అన్నారు. అమ్మా, నాన్నా "వెళ్ళిరామ్మా - కొత్తచోటు, పసితనపు చేష్టలు చేయకు" అన్నారు దుఃఖంతో.

ప్రతిమాటా రేఖను కలవరపరచింది. అత్తవారింటి కెళ్ళడమనేది, ఆడపిల్ల జీవితములో అదొక భయంకరావస్థ కాబోలనుకుంది. నుదుట కుంకుమతో, ప్రయాణాయాసముచేత కొద్దిగా వాడిన పూలతో, సౌందర్యం ఒలకపోస్తున్న ముద్దుమొగముతో రేఖ ఆ యింట్లో అడుగుపెట్టింది.

"వదినె వస్తోంది అమ్మా! ఓ అమ్మా" అంటూ పిల్లలు బిలబిలా పరుగులెత్తారు వంట యింట్లోకి. భాగీరథి చిరునవ్వుతో హాలులోనికివచ్చి కోడల్ని ఆప్యాయంగా పలకరించింది. రేఖవెంబడివచ్చిన పెద్దన్నను పలుకరించిన తరువాత ఆమె రేఖను తీసుకొని లోపలికి వెళ్లింది.

"రేఖా! కాస్త కాఫీచేయి. నేను నాలుగు పూరీలు కాలుస్తాను. మీ యన్నకిత్తువుగాని" అంది భాగీరథి. రేఖ గ్రహించింది. ఇచ్చట తానూ పనిలోకి ప్రవేశింపవచ్చునని. పూరీలు, కాఫీ ఒకేమారు రెడీ అయినవి. "మీయన్న కిచ్చిరా" అని పంపింది భాగీరథి.

భాగీరథినిచూచి రేఖకి ప్రేమ, భక్తి ఒకేసారి గలిగినవి. ఈ యింట్లో తాను స్వంతమనిషిలానే మెలగాలేమో అనుకుని రేఖ అన్నయ్యకు కాఫీ పూరీలు యిచ్చి వచ్చింది. కాఫీ యేమీ బాగాలేదు. అది రేఖ ఎప్పుడూ కాచినదిలేదు. అత్తయ్య కోప్పుడుతుందని రేఖ దిగాలుపడిపోయింది. కాని భాగీరథి కోప్పడలేదు సరికదా, "నీవు వాడుకలేదు రేఖా! చేస్తుంటే చక్కగా తయారుచేయగలవు" అంది. రేఖకి ఆమె హృదయం అర్థమయింది.

తాను పసిది తనకేమీ తెలియదు. ఆమె వల్లనే తానిప్పుడు ధైర్యంగావుంది. ఇంతలో మేడదిగి మామగారొచ్చి రేఖను, పలుకరించారు. "దిగులు పడబోకమ్మా రేఖా! మీ అత్తయ్య నీకు పెద్దగావుంటుంది" అన్నారు. ఆయన్ను చూడగానే రేఖకు భక్తీ గౌరవమూ దానంతటవే కలిగినవి.

పదహైదేండ్ల రేఖ అత్తగారిల్లంటే యిదేనా అని విస్తుపోయింది. ప్రొద్దున్నే లేవడం స్నానంచేసి చక్కగా జడ అల్లుకోవడం, ఆ తరువాత కుంపటి కగ్గివేసి, కాఫీ కాచేది. తరువాత అత్తగారూ, ఒకరొకరేలేచి కాఫీకొచ్చేవారు. ఇవ్వడం మాత్రం అత్తగారికే వదిలేసేది రేఖ.

రెండు వెండిగ్లాసులనిండా కాఫీపట్టుకొని ఒకటి మామగారికీ, ఒకటి మేడమీదికీ పట్టుకెళ్లేది. మేడమీది నల్లకళ్లు తనకోసం ఎదురు చూస్తుంటవి. పదింటికల్లా ఆయన కాలేజీ కెళ్తారు. భోజనం పన్నెండుకు కాని కాదు. కాస్త వుప్పిండో, దోశో చేసి తన అత్తగారు యిచ్చి రమ్మనేవారు.

తరువాత అత్తగారికీ కూరలు తరిగిచ్చేది. తప్పేలాలో బియ్యంపోసి అక్కడ పెట్టేది. ఇలాగే కావలసినవన్నీ అమర్చిపెట్టి, తానూ వెళ్ళిపోయేది. సామాను సర్దిపెట్టడం, తన చిన్ని మరదండ్రక్కూ, మరదులకూ ముస్తాబుచేయడం, నీళ్ళు పని మనిషి చేదిస్తే, అందుకోవడంలాంటి చిన్న పనులు చేసుకుంటూ వుండేది.

వంట అయిందంటే పిల్లలూ, మామగారూ భోంచేసేవారు. ఒంటిగంటకు కాలేజీనుండి ఆయనా వచ్చేవారు. ముగ్గురూకలిసి భోంచేసేవారు. రేఖ ఆ యింట్లో ఓ దేవకన్యలాగుండేది. ప్రభాకరం తరువాత, ఆ యింట్లో అందరూ చిన్నపిల్లలేగా. ప్రభాకరం కాలేజీకి వెళ్లేవాడు. ఇక రేఖ ఆ యింట్లో చిన్న లేడి పిల్లలా చెంగు చెంగున గంతులు వేస్తూ, నిరంతరం మధుర మందహాసం వెలిగిస్తూ ఆ యింటికో వింతశోభ చేకూరుస్తుండేది.

ఇక పండుగపూటా తననుచూచి, భాగీరథి కళ్లల్లో వెలిగే ఆనందరేఖల గుర్తించి, రేఖ కృతజ్ఞతగా చిరునవ్వు నవ్వేది. రేఖ పురుటికోసం పుట్టింటి కెళ్లింది. వెళ్ళిన పదిరోజులవరకూ, మిత్రులతో, అత్తగారింటి సౌభాగ్యాన్ని గురించి చెప్పుకుంటూనే గడిచింది.

మరో నాలుగు నెలలకు రేఖ ఆడశిశువుని కన్నది. అత్తగారింటివారు వచ్చారు. ఆ పదిరోజులూ అక్కడే వుండి పదకొండోనాడు బారసాల మహా వైభవంగా జరిపించి అత్తగారింటివాళ్లు వెళ్ళిపోయారు.

మరో నాలుగు మాసాలకి రేఖ పాపాయితో అత్తగారింటికొచ్చింది. కోడలకి దిష్టితీసి స్వాగతం యిచ్చింది భాగీరథి. మామగారు పాపాయి నందుకున్నారు. "మాకేమిటి తెచ్చావు ?" అని పిల్లలు గోలచేస్తున్నారు.

ఆయనగారి అనురాగమూ రేఖని కలవరపెట్టింది. ఆ రాత్రి రేఖ దీర్ఘంగా ఆలోచిస్తూ పండుకున్నది. తన బాల్యం పుట్టింటిలో గడిచింది. విశాల హృదయం, విశ్వమానవప్రేమ, పెద్దవారిపై గౌరవమూ, భర్తతో సంచరించెడి విధానము, భాగీరథివలన తాను నేర్చుకున్నది. ఆమె వడిలో తాను సంపూర్ణ స్త్రీత్వము సంపాదించింది.

కొందరి అత్తగార్లు చీటికీ, మాటికీ కోడళ్ళను తిట్టూవుంటారు. కాని తన అత్తగారు తన తల్లిలాంటి అమృతమయి. బాలికలను వారి మనస్తత్వరీత్యా అందుబాటులోనికి తీసుకురావాలికాని, అనుభవం లేక, బాల్యదశనుండి వ్యక్తతకు అప్పుడప్పుడే వస్తున్న బాలికలను, అత్తలు బాధపెట్టడం, వ్యక్తిద్వేషం పెంచడంవంటిది.

కాని తన కలాంటి విషపాత్ర లభింపలేదు. మొదటి పరిచయంలోనే భాగీరథిమీద తనకు భక్తి కలిగింది. తనవంటి సాధుబాలికకు అలాంటి అసాధ్యపు అత్త దొరికివుంటే - రేఖ వణికింది - తన స్థితి అధోగతే. కాని ... రేఖకు భాగీరథి ప్రేమ హృదయం ఒక్కపరి కన్పడింది. రేఖ ఆమెకు తన హృదయంలోనే నమస్కరించింది.

"ఏంరేఖా ! ఇంకా నిద్రపోలేదా ?" అప్పుడే లోనికివచ్చిన ప్రభాకరం పలకరించాడు. రేఖ చిరునవ్వు నవ్వింది.

---

యజమాని:-ఒరే వెధవా చెప్పినపని చెయ్యవు నీ వసలు మనిషి వేనటరా ?

నౌకరు:-నేను మనిషిని కాని-చో ఒరే వెధవా అని మీరు పిలుస్తారటండీ ?

♦ ♦ ♦

యజమాని:-ఒరే తమలపాకులు, రెండు సిగరెట్లు తీసుకొని మిగతా వాపసు తీసుకురారా.

నౌకరు:-అయ్యా మరి వాపసు అర్థవీశె చాలా అండి.

♦ ♦ ♦

రాము:-వీపుమీదకొట్టకు అసలేపేలి అట్ట కట్టింది.

సోము:-ఒకటిస్తే ఆ అట్ట కాస్త ఊడుతుందిరా.

కుమారి పి. శాంత

---